ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోండి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, పక్కన ఎమ్మెల్యే కవ్వంపెల్లి

ఇల్లంతకుంట, ఆగస్టు 6 : జిల్లా కేంద్రంలో నేటి నుంచి 10 వరకు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి దరఖాస్తుల స్వీకరణ క్యాంపులు నిర్వహిస్తారని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని డబుల్ బెడ్రూం ఇండ్లల్లో ఏమైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలకు రోడ్డు సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు బోధించారు. పలువురు విద్యార్థులను ప్రశ్నలడిగి తెలుసుకుని అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. గత సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. వెంకట్రావుపల్లి, ముస్కానిపేట గ్రామాల రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమాల్లో డీఆర్డీవో శేషాద్రి, సీడీపీవో సబిత, మండల ప్రత్యేకాధికారి బుద్ధానాయుడు, తహసీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో శశికళ, డీఈలు, ఏఈలు, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కలెక్టర్ పూజలు

వేములవాడ రూరల్, ఆగస్టు 6: వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌ను ఆలయ అర్చకులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

వేతనాలు చెల్లించండి

- నల్ల బ్యాడ్జీలతో మోడల్ స్కూల్ టీచర్ల నిరసన



మోడల్ స్కూల్ ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలుపుతున్న టీచర్లు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6 : పెండింగ్‌లో ఉన్న రెండు వేతనాలు చెల్లించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని మోడల్‌స్కూల్‌లో టీచర్లు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు జూన్, జూలై వేతనాలు అందలేదని తెలిపారు. బదిలీలు లేక ఒకే పాఠశాలలో 11 ఏళ్లుగా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 010 పద్దు ద్వారా వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ నిరసనలో ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ఎంపీడీవో లక్ష్మీనారాయణ

కలెక్టరేట్: ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల రూరల్: సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో సార్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

సార్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్‌సార్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఊరూరా జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. సార్ సేవలు చిరస్మరణీయని కొనియాడారు.

తెలంగాణ భవన్‌లో జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్‌సార్ చిత్రపటం వద్ద పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భవన్‌లో జయశంకర్‌సార్ చిత్రపటం వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి దశ, దిశ సూచించిన రాజకీయ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, కుంబాల మల్లారెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్, కల్లూరి రాజు, పోచవేని ఎల్లయ్య, బుర్ర మల్లికార్జున్, గాజుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6: తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఇక్కడ ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ రమేశ్, తదితరులున్నారు. అలాగే, నేరెళ్లలోని ప్రాథమిక పాఠశాలలో ఆర్క మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల చూచిరాత నోటు పుస్తకాలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి చేతుల మీదుగా అందజేసినట్లు హెచ్‌ఎం దుబ్బాక ప్రభాకర్ తెలిపారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్ చీటి పద్మ, ఉపాధ్యాయులున్నారు. అలాగే, సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి కమాండెంట్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్లు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్, ఆగస్టు 6 : తన జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర సాధనకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని, వారి సేవలు చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యానాయక్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్‌రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, అధికారులున్నారు.

తెలంగాణ చౌక్, ఆగస్టు 6: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇక్కడ ఆర్ఐలు యాదగిరి, మధూకర్, రమేశ్, సీఐ శ్రీనివాస్, ఏవో పద్మ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ముస్తాబాద్, ఆగస్టు 6 : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు ఓరుగంటి తిరుపతి, సద్గునాచారి, లక్ష్మీరాజం, మారేపు రాజానందం, నవీన్ చారి పెంటాచారి, కల్వకోట రాజు, చెవుల మల్లేశ్ యాదవ్, పలువురు నాయకులున్నారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: మండల కేంద్రంలో స్వర్ణకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి వాసరవేణి పరశురాములు, స్వర్ణకార సంఘం నాయకులున్నారు.

చందుర్తి, (రుద్రంగి) ఆగస్టు 6: మండల కేంద్రంలోని సెస్ సేవాసదన్‌లో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ సిబ్బంది ఉన్నారు.

వేములవాడ రూరల్, ఆగస్టు 6: వేములవాడ పట్టణ శివారులోని శాత్రాజుపల్లిరోడ్డులోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రామలింగేశ్వర్వ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి స్వప్న, అధ్యాపకులు,విద్యార్థులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: మండల కేంద్రానికి చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.1.21లక్షలు మంజూరు కాగా సదరు చెక్కులను అందించారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్, మాజీ ఎంపీటీసీ పందిల్ల నాగరాణి, నేవూరి వెంకటనర్సింహారెడ్డి, పందిల్ల పరశురాములు, గడ్డం వెంకటేశ్, లావణ్య, దేవేందర్, బాలాగౌడ్, గుండాడి వెంకట్‌రెడ్డి, జీడి శ్రీనివాస్, చందనం శివ, బ్రహ్మచారి, దేవరాజు, శ్రీకాంత్, పవన్ తదితరులున్నారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: దళిత సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో పెట్టిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంతుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఇక్కడ బీజేపీ నాయకులు వేణు, భిక్షపతి, రవీందర్, ఆంజనేయులు, మిర్యాల్‌కార్ రవి, తదితరులున్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న విప్

చందుర్తి,(రుద్రంగి) ఆగస్టు 6: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన తుమ్మనపల్లి జనార్దన్ తల్లి తుమ్మనపెల్లి లక్ష్మి(లచ్చవ్వ) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అంతిమయాత్రలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

జ్వరంతో యువ రైతు మృతి

చందుర్తి, ఆగస్టు 6: చందుర్తి మండల కేంద్రానికి చెందిన యువ రైతు లింగంపల్లి హరీశ్ (28) జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. హరీశ్ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇదే సమయంలో రక్త కణాలు తగ్గడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య లత, కూతురు షేని ఉన్నారు.

మెరిట్ అభ్యర్థులకు అవకాశం కల్పించాలి

వేములవాడ, ఆగస్టు 6: గురుకుల పోస్టుల్లో మెరిట్ అభ్యర్థులకు అవకాశం కల్పించాలంటూ మెరిట్ అభ్యర్థుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవల నియామకం చేపట్టిన గురుకుల పోస్టులలో 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కాగా ముందుగా ప్రకటించిన నోటిఫికేషన్‌లో అభ్యర్థుల నియామకం తర్వాత ఏర్పడిన ఖాళీల్లో తదుపరి మెరిట్ కలిగిన అభ్యర్థులను నియమించేలా చూడాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. ఇక్కడ మెరిట్ అభ్యర్థులు మనోహర్, పరశురాము లు, నరేందర్ సాయికృష్ణ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నమైనా సిబ్బంది రాలేదని రైతు ఆవేదన

చందుర్తి, ఆగస్టు 6: పొలానికి ఎరువు కావాలని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాసినా సనుగుల సహకార సంఘం పరిధి సిబ్బంది రాలేదని లింగంపేట రైతు అరె సంతోష్ ఆవేదన వ్యక్తం చేశాడు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సహకార సంఘం సిబ్బందిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. దీనిపై సీఈవో శ్రీవర్ధన్‌ను వివరణకోరగా క్లస్టర్ పరిధిలోని మూడు గోదాముల్లో ఎరువుల బస్తాలు పంపిణీ చేస్తుండడంతో సిబ్బంది కొరత ఉన్నందున కొంత ఆలస్యమైన మాట నిజమేనని, పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6: పదిర వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మంగళవారం బొప్పాపూర్ శివారులోని రాచర్ల జూనియర్ కళాశాల వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక లోడుతో ఉన్న టాటా ఏస్ వాహనం వచ్చింది. అనుమతి లేదని తెలియడంతో వాహనాన్ని సీజ్ చేసి ఠాణాకు తరలించారు. ఇందుకు కారణమైన అల్లెపు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయసాధన కోసం పాటుపడదాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 6 : ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం మనమందరం పాటుపడదామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న ఆలయ అతిథి గృహంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఒక విద్యావేత్తగా అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపి, తెలంగాణ రావాలని తపనపడిన మహనీయుడు జయశంకర్‌సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ మధు రఘునందన్, ఏఈ నాగరాజు, గోలి శ్రీనివాస్, ఈవో సీసీ ఎడ్ల శివ, వంశీమోహన్ తదితరులున్నారు.



జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899. NT-325783-All

★ప్రముఖ కార్పొరేట్ కాలేజ్ నందు పని చేయుటకు మార్కెటింగ్ అనుభవంగల యువతీ యువకులు కావలెను. జీతం: 35K+TA, అర్హత: గ్రాడ్యుయేషన్, ఏరియా: కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలవారు సంప్ర: 7731069689. NT-332611

పేరు మార్చబడినది

ముత్యపు సుచిత్ర W/o. ముత్యపు రమేష్, H.No. 2-3-108/1, మార్కెట్‌రోడ్, మెట్‌పల్లి టౌన్ & మండలం, జగిత్యాల జిల్లా, నా యొక్క పేరు ముత్యపు త్రివేణి W/o. ముత్యపు రమేష్ గా పేరు మార్చబడినది.

CHANGE OF NAME

★Nareddy Sanjeevlu, S/o. Narayana (Old Name), H.No. 5-46/3, Jyothinagar, Sircilla Town & Mandal, my Name and Father Name was changed as Nareddy Sanjeeva Reddy S/o Ranga Reddy (New Name) NTK-325527

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571 91827 77194

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ముస్తాబాద్ ఆగస్టు 6 : ఎగువ మానేరు ప్రధాన కాలువలోకి మండల కేంద్రంలోని మురుగు కాల్వల ద్వారా నీరు రాకుండా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు నీటి పారుదల, పంచాయతీరాజ్ శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగు నీటితోపాటు చెత్తాచెదారం నిలిచి దుర్వాసన వస్తున్నదని, స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ముస్తాబాద్‌కు వచ్చిన కలెక్టర్‌ను కలిసి మహిళలు వేడుకున్నారు. కలెక్టర్ అధికారులను కాల్వలోకి నీరు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు వేసి నివేదిక కలెక్టర్ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ నీటిపారుదల శాఖ ముస్తాబాద్ సెక్షన్ డీఈఈ ఎం రవికుమార్, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఇంజినీర్ సుదర్శన్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఇనాయతుల్లా ఇరిగేషన్ ఏఈ వంశీ రెండు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

కోనరావుపేట, ఆగస్టు 6: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. ధర్మారం గ్రామంలోని కుల సంఘాలు కలిసి రూ.1.5 లక్షలు పోగు చేసి ఎనిమిది సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గ్రామస్తులంతా ఏకతాటిపై వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఐ శేఖర్‌రెడ్డిని గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఇక్కడ పోలీసు సిబ్బంది, గ్రామస్తులున్నారు.

సమస్యల పరిష్కారానికి ఒక్కరోజు సమ్మె

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 8న ఒక్కరోజు సమ్మె నిర్వహిస్తున్నామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, కోలచంద్రయ్య పేర్కొన్నారు. మండల పరిషత్‌లో ఎంపీడీవో లక్ష్మీనారాయణను కలిసి, ఒక్కరోజు సమ్మె నోటీస్ అందించారు. కార్యక్రమంలో రవీందర్, తిరుపతి,రాజు, సభ్యులున్నారు.

శ్రావణమాసంలో ఆర్టీసీ ఆదాయం పెరగాలి

కలెక్టరేట్, ఆగస్టు 6 : శ్రావణమాసం సందర్భంగా ఆర్టీసీకి మరింత ఆదాయం పెంచేలా కృషి చేయాలని టీజీఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల డిపోను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రాజమౌళి, రామకృష్ణ, సేఫ్టీ వార్డెన్ రాంరెడ్డి, ఉద్యోగులు మల్లేశ్, రఘు, రామరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మధ్యమానేరు నుంచి డీ3 కాలువకు నీటిని విడుదల చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 6 : మండలంలోని కందికట్కూర్ గ్రామ శివారులోని రాజరాజేశ్వర ప్రాజెక్టు(మధ్య మానేరు) నుంచి డీ3 కాలువకు సాగు నీరు విడుదల చేయాలని మంగళవారం తహసీల్దార్‌కు మండలంలోని వల్లంపట్ల రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గత సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురువక భూగర్భ జలాలు అడుగంటి రైతులు వేసిన పంటలు ఎండిపోయాయన్నారు.

అన్నపూర్ణ నుంచి రంగనాయకసాగర్‌కు గోదావరి జలాలు

బోయినపల్లి/ ఇల్లంతకుంట, ఆగస్టు 6 : మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు చేరుతున్న జలాలు మంగళవారం రంగనాయకసాగర్‌వైపు పరుగులు తీశాయి. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు ఓపెన్ చేసి అంతే మొత్తంలో రంగనాయక సాగర్‌కు వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం 1.92 టీఎంసీల నీరు నిల్వఉన్నటు అధికారులు తెలిపారు.

తాగునీటి వనరులు పరిశుభ్రం చేయాలి

వేములవాడ రూరల్, ఆగస్టు 6: ప్రభుత్వ ఆదేశానుసారం నిర్ణీత సమయంలో తాగునీటి వనరులను శుభ్రం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం జయవరంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 6: గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలని తంగళ్లపల్లి ప్రత్యేకాధికారి, ఆర్డీవో రమేశ్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మం డలం పాపయ్యపల్లె, తాడూరు గ్రామాలను సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీనారాయణ, నవీన్‌రావు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, కమిటీ సభ్యులున్నారు.

కాంగ్రెస్ అసత్యపు ప్రచారాలతో కాలంవెళ్ల దీస్తోంది

- వేములవాడలో బీఆర్ఎస్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ, ఆగస్టు 6: కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలతో కాలంవెళ్లదీస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కౌన్సిలర్, సీనియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్ సిరిగిరి రామ్ చందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, ఈర్లపల్లి రాజు మాట్లాడారు. నియోజకవర్గ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వారానికి ఒకసారి ప్రెస్ మీట్‌లు పెట్టి ప్రజలకు ఇది చేశాం.. అది చేశామంటూ అసత్యపు పోకడలతో కాలయాపన మాత్రమే చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని పనులు చేశారో బహిరంగ చర్చకు రావాలని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గానికి మల్కపేట రిజర్వాయర్, వేములవాడ రాజన్న ఆలయానికి 32 ఎకరాల స్థల సేకరణ, పురపాలక సంఘంలో బైపాస్ రహదారుల విస్తరణ, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరిగిన కాంగ్రెస్ నాయకులకు కనబడడం లేదా అని ఎద్దేవా చేశారు. నిండు సభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు ఆడవారి నమ్ముకుంటే మోసపోక తప్పదని చివరికి జూబ్లీ బస్టాండ్‌లో కూర్చోవాల్సిందేనని మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. నిరసనగా వేములవాడ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తే.. దిష్టిబొమ్మలు ఎందుకు దహనం చేస్తున్నారు... ఏంటో అర్థం కావట్లేదు అని... అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అనడం శోచనీయమన్నారు. బడ్జెట్‌లో రూ.50 కోట్ల నిధులు వేములవాడ ఆలయానికి పెట్టామని ప్రెస్ మీట్‌లో చెప్పి తర్వాత రోజు రాజన్నకు కోడెముక్కులని, మరుసటి రోజు పాలాభిషేకాలని రోజులు గడుపుతున్నారే తప్ప అభివృద్ధి జరిగింది మాత్రం శూన్యమన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఏం జరుగుతుందో కాంగ్రెస్ నాయకులు చూడాలని.. లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే వారికి గుణపాఠం చెప్పే రోజులు వస్తాయని జోస్యం చెప్పారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ రవీందర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కౌన్సిలర్ కుమ్మరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు వాసాల శ్రీనివాస్, అంజద్‌పాషా, దుర్మట్ల వెంకటరెడ్డి, మైలారం రాము, కమలాకర్ రెడ్డి, రవిచంద్ర గౌడ్, ప్రేమ్‌చారి, బత్తుల మహేందర్ యాదవ్, రాంబాబు, పోతు అనిల్‌కుమార్, మంత సందీప్, ప్రమోద్, తుమ్మల దిలీప్, సంతోష్, లింగం రాకేశ్, దమ్మ భాస్కర్, రఫీ, ఉమర్, యూసఫ్, అఫ్సర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం

చందుర్తి,(రుద్రంగి) ఆగస్టు 6:మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని ఏఎస్ఐ ప్రమీల స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. వి ద్యార్థినులు ఈవ్ టీజింగ్‌కు గురైతే షీ టీం వెంటనే స్పందిస్తుందని, ప్రతి మహిళలు విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ఇబ్బందులకు గురిచేస్తే షీ టీమ్ నెంబర్ 871 2656425కు లేదా 100కు కాల్ చేయాలని తెలిపారు. ఇక్కడ అధ్యాపకులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోగులతో మర్యాదగా మెదలాలి

ముస్తాబాద్, ఆగస్టు 6 : మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులతో సిబ్బంది అందుబాటులో ఉండి మర్యాదపూర్వక సేవలందించాలని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి రాజ్‌గోపాల్ సిబ్బందికి సూచించారు. మంగళవారం దవాఖానకు ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది, మందుల వివరాలతోపాటు దవాఖాన పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో హస్పిటల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలున్నారు.

27 మంది రాజన్న ఆలయ ఉద్యోగుల బదిలీ

- అర్ధరాత్రి దాటాక ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్
- సీనియార్టీ ప్రకారం ఇద్దరు ఉద్యోగులు అదనంగా బదిలీ

వేములవాడ, ఆగస్టు 6: రాష్ట్రవ్యాప్త దేవాలయ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా రాజన్న ఆలయ ఉద్యోగులు 27 మందిని బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీర్ఘకాలికంగా ఉన్న వారిని బదిలీ చేస్తామని మూడు మాసాల కింద జరిగిన సమావేశంలోనే నిర్ణయించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఉన్నతాధికారులు కసరత్తు మధ్య ఎట్టకేలకు బదిలీలు అయ్యాయి. అయితే జూలై 30 వరకే బదిలీ ప్రక్రియ జరగాల్సి ఉండగా అసెంబ్లీ నేపథ్యంలో ఆగస్టు 5వ తేదీ వరకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే ఆగస్టు 5న ప్రభుత్వం వెలువరించిన జీవో సమయం గడిచిపోతుండడంతో దాదాపు రాత్రి ఒంటిగంట వరకు ఉద్యోగులు బదిలీ ఉత్తర్వుల కోసం ఆలయ ఉద్యోగుల మదన పడ్డారు. చివరికి ఒంటి గంట దాటాక కార్యాలయానికి మెయిల్ ద్వారా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులను పంపారు.

27 మంది ఉద్యోగుల బదిలీ

వేములవాడ రాజన్న ఆలయం నుంచి 27 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇందులో ఏఈవోలు సంకెపల్లి హరికిషన్ భద్రాచలం, ప్రతాప నవీన్ యాదగిరిగుట్ట, పర్యవేక్షకులు శ్రీరాములు కొమురవెల్లి, హరిహర నాథ్ కొండగట్టు, లక్ష్మణ్ రావు బాసర, అరుణ్ భద్రాచలం, నటరాజ్, మహేశ్, గోలి శ్రీనివాస్‌లు యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్లు పత్తిపాక శ్రీనివాస్, రాజేందర్, రవీందర్, పవన్ కుమార్, రమేశ్‌లు యాదగిరిగుట్టకు, భూపతి రెడ్డి, చెక్కిల్ల అశోక్ కొండగట్టుకు, సిహెచ్ రాజేశ్వర్ బాసర, డీఈ రామేశ్వర్ రావు యాదగిరిగుట్ట, జూనియర్ అసిస్టెంట్లు నక్క తిరుపతి, నగేశ్ రాజు, ఎల్. రాజేందర్, సీహెచ్ లింగయ్యలు యాదగిరి గుట్ట, సిహెచ్ శ్రీనివాస్ బాసర, తూం శ్రీనివాస్, రవి, నాంపల్లి, కూరగాయల రాములు కొండగట్టు ఆలయాలకు బదిలీ అయ్యారు.

40 శాతం మేర ఉద్యోగుల బదిలీ చేస్తామని చెప్పిన ఉన్నతాధికారులు సీనియార్టీ ప్రకారం మరో ఇద్దరు సూపరింటెండెంట్లను అదనంగా బదిలీ చేయడంతో మొత్తం 27 మంది ఉద్యోగులకు బదిలీలయ్యాయి. దాదాపు 17 సంవత్సరాల తర్వాత పెద్ద మొత్తంలో ఆలయాల బదిలీలు జరుగగా రాజన్న ఆలయం నుంచి కూడా భారీ ఎత్తున ఉద్యోగులు బదిలీగా అయ్యారు. మొత్తంగా యాదగిరిగుట్టకు 14 మంది, కొండగట్టు 7, బాసర 3, భద్రాచలం 2, కొమురవెల్లి 1 కలిపి మొత్తం 27 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. మంగళవారం ఈవో వినోద్ రెడ్డి బదిలీ అయిన ఉద్యోగులను రిలీవ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ వేములవాడ పట్టణ కమిటీ ఎన్నిక

సాయి భరత్



శివ

వేములవాడ, ఆగస్టు 6: ఎస్ఎఫ్ఐ వేములవాడ పట్టణ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి మల్లారం ప్రశాంత్ తెలిపారు. ఇందులో అధ్యక్షుడిగా సాయి భరత్, కార్యదర్శిగా శివ, ఉపాధ్యక్షులుగా ఆర్ శివ, సహాయ కార్యదర్శిలు సా యి అనురాగ్ శివరామకృష్ణను ఎన్నుకున్న ట్లు వారు తెలిపారు. అనంతరం నూతనం గా ఎన్నికైన పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సాయి భరత్, శివ మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి అధ్యక్ష కార్యదర్శులు ఎన్నుకున్నందుకు జిల్లా కమిటీకి ధన్యవాదాలు పేర్కొన్నారు.